# మమకారం

అర్ధరాత్రి దాటింది.

దోమల సంగీతంతోనూ, నల్లుల పరామర్శతోనూ పది, పదకొండు దాకా మేలుకున్నానేమో, ఆ తరువాత గాఢంగా నిద్రపట్టింది, కానీ సత్కార్యానికి వెయ్యి విఘ్నాలు! కదిపి కదిపీ లేపి కూర్చోబెట్టింది శకుంతల.

"అబ్బబ్బ. ఏం మొద్దునిద్రండీ మీకు మరీనూ!....ఇష్, బలంగా మాట్లాడకండి, అవతల కొంపలంటుక పోతున్నాయి...."

తెల్లబోయి శకుంతలవైపు అయోమయంగా చూచాను.

"చెవి ఒగ్గి వినండి. గుసగుసలు వినిపించడం లేదూ?"

నిజానికి నాకేమీ వినిపించడం లేదు. నిద్రమైకంతో ఆవులిస్తూ "కలగన్నావా శకుంతలా?" అన్నాను.

శకుంతల చరాలున పైకి లేచింది. చేయి పట్టుకుని నన్ను వంటగదిలోకి లాక్కెళ్ళింది.

"ఐనా కళ్ళుండీ చూడలేకపోతే, చెవులుండీ వినలేకపోతే ఎలాగండీ! ఆ కుర్రాణ్ణి పొరుగున చేర్చవద్దంటే విన్నారుగారు. అతగాడిప్పుడు ఏం చేశాడో చూశారూ! నలుగురికీ తెలిస్తే యింకేమైనా వుందిటండీ! ఊరు వూరంతా కలిసివచ్చి వీడి ఎముక లేరేయరూ?"

"ఇంతకూ జరిగిం దేమిటో కాస్త వివరంగా చెప్పగూడదా శకుంతలా?"

"చెబుతే మాత్రం మీరు నమ్ముతారు గనుకనా! పైగా మీ స్నేహితుడి పైన లేనిపోని అభాండాలు వేస్తున్నానంటారు. నా కెందుకొచ్చిన పీడ! ఆ చూడవలసిం దేమిటో మీరు మీ కళ్ళతోనే చూస్తే సరిపోతుంది."

"ఏదీ, అదేమిటో కంటికి కనిపించడం లేదే మరి!"

ఈసారి నన్ను శకుంతల వీధి గుమ్మందాకా లాక్కెళ్ళింది. మెల్లగా గడియ తీసి, ఒకటిరెం డంగుళాల మేరకూ తలుపు తరిచింది. "కదల కుండా యిక్కడ కూర్చోండి" అంటూ చూపులతోనే సైగ చేసింది.

అర్ధాంగి ఆదేశాన్ని శిరసావహించడం కొన్ని పరిస్థితుల్లో తప్పని సరి! గోడకు చేరగిలబడి అంధకారంలోకి చూస్తూ కూర్చున్నాను.

శకుంతల అనుమాన మేమిటో నాకు రూఢిగా తెలుసు. ఆమె నాలు గైదు మాసాలుగా ఆ అనుమానాంకురానికి పాదికట్టి, నీరుపెట్టి పోషించు కుంటూ వస్తోంది. ఆ అనుమానం అనుమానంగానే సమసిపోతుందనీ, అందులో వాస్తవం లేశమైనా వుండదనీ నా నమ్మకం. తన వ్యూహ గ్రామా న్నంతా కదిలించివేసే యధార్థంగా బయటపడక తప్పదని శకుంతల విశ్వాసం!

పరువం బుసలుకొట్టే పడుచువాడిలో కొంటెతనం కొంతవరకూ క్షంతవ్యం కాకపోదన్న ఉద్దేశంతో నేను నారాయణను ప్రక్క వాటాలో చేరనిచ్చాను. ఎంత కొంటెవాడైనా కాలికి పాము చుట్టుకున్నతర్వాత కాటు తప్పదన్న సత్యాన్ని అతడు జ్ఞప్తిలో వుంచుకోగలడని ఆశించాను. కానీ శకుంతల కథనాన్నిబట్టి చూస్తే ఆ పొరబాటేదో యిదివరకే జరిగిపోయినట్టు బోధపడుతోంది. అలాగని శకుంతల యింతకూ అంతకూ అపోహలతో సతమతమయ్యే మనిషిగూడా కాదు. కానీ ఈ నారాయణ తనను కట్టివేసే త్రాళ్ళను తానే కొని తెచ్చుకోగలడని నే నెలా అనుకోగలను?

ఒకటి....రెండు....మూడు....మెల్లగా నిమిషాలు గడచి పోతు న్నాయి.

ఐనా నారాయణను గురించి యింతగా ఆలోచించవలసిన అవసర మేమీ నాకులేదు. ఇదొకపనిగా పత్తేదారుతనం ఒలకబోసి రహస్యాలు

ఆరా తీయవలసిన ప్రమేయమూలేదు. చెరుకు వంకరను తీర్చడానికి గానుగ ఎలాగూ వుండనే వుంటుంది గనుక, నా చింత నారాయణను గురించిగాదు! కానీ నేను నారప్పకు మాట యిచ్చాను. 'నా తమ్ముడొకటిగాదు, వీడొకటి గాదు. నాకళ్ళుకప్పి అలాటప్పాగా తిరగగలగడం వీడి తరంగాదు. నువ్విక పైన నిశ్చింతగా వుండవచ్చు' అని నమ్మకం చెప్పాను. ఆరవై వసంతాలు కళ్ళజూచిన ఆ వృద్ధుడి కళ్ళల్లో కృతజ్ఞత కన్నీరుగా పెల్లుబికింది. 'బాబూ! ఇంతమాట చెప్పేనాథుడు ఈనాటికి గానీ కనిపించాడుకాడు. మావాడీ వూరికి రానై నా వచ్చాడుగానీ, తోబుట్టిన అన్నలాంటి వాడివి నువ్వు అండగా దొరి కావు. నిజానికి మా నారాయణ మంచివాడు. కానీ కాస్తా తెలియనితనం! కుర్ర వాడుగదా! ఇది మంచి, యిది చెడ్డ అని నచ్చజెబుతే యిట్టే గ్రహిస్తాడు. వెళ్ళొస్తాను బాబూ! మరచిపోవద్దు-వారానికో జాబు వ్రాస్తుండమను....''

బస్సు కదిలింది. కదిలిన బస్సులోనుంచీ దీనంగా నా వైపు చూస్తున్న ఆ ముసలివాడి పరిదీన విగ్రహం ఇంకా నా కళ్ళల్లో మెదులు తోంది. అవును. నేనతనికి మాట యిచ్చాను. కానీ ఆ మాటను ఎంతవరకూ నిలబెట్టుకోగలిగాను?

నారాయణను గురించి పొరబాటుగా అంచనా వేసుకున్న అవివేకం నాది. లేకపోతే నారప్పదగ్గర అలా మాట జారివుండేవాణ్ణిగాను. నారాయణ ఎదుటివాడికేసి చూచే చూపుల్లో అమాయికత్వం తొణికిసలాడినట్టుండేది. అవి నిశ్చలంగానూ, నిర్మలంగానూ వున్న కాసారంలాంటి చూపులైతే, ఆ కాసారంలో లోతుల్లో ముళ్ళకంపలూ, మొసళ్ళూ వుండవచ్చునని నేను భావించలేకపోయాను. లేదంటే అతడి మాటల్లో వెకిలితనం మాత్రం బాహాటంగానే గోచరించేది. ఐతే ఆ వెకిలితనం అతడిలో లోపలి తెంపరి తనానికి బాహ్యలక్షణమని నే నూహించలేకపోయాను.

నిమిషాలు పరుగెడుతున్నాయి. పది, పదిహేను, యిరవై-ఇంచు మించు అరగంట కావస్తోంది.

మెల్లగా ఒక్కింత సవ్వడి....నిశ్చలమైన వాతావరణంలో ఓ పిల్ల తెమ్మెర లేచినట్టుగా తలుపు తెరిచిన సవ్వడి వినిపించింది.

ముఖాన్ని ముసుగులో దాచుకుని, చేతిలో గాజులు సైతం కదల కుండా జాగ్రత్తపడుతూ, చీకటిలో చీకటిగా కలిసి ముందుకు కదిలిపోతున్న ఆకారం ఒకటి నాకు దృగ్గోచరమైంది. ఆ ఆకారం వసారా దాటింది. వీధి మెట్లు దిగింది. ఆకాశంలో జర్రున జారిపోతున్న మేఘశకలంలా నా దృక్పథంనుంచీ మాయమైపోయింది.

ఎలా పైకి లేచానో నాకే తెలియదు. వెళ్ళి, హాల్లో నా పరుపుపైన కూలబడిపోయాను.

బయట మంచుకురుస్తున్న ఆ అర్ధరాత్రి సమయాన నా ముఖాన స్వేదం గుప్పుగుప్పున పొటమరిచి పోతోంది?

శకుంతల చేరువకు వచ్చి కంగారుతో నా రొమ్ముపైన చేయివేసి చూచింది-గుండె యింజనులా రొప్పుతోంది.

"ఐనా బలేవారండి మీరు! మీ నెత్తిపైకేమొచ్చిందని! ఏ వాగు ఏ వంకలో కలిస్తే మనదేం పోయింది? లేదంటే దుష్టుణ్ణి దూరంగా వుంచ మన్నారు. ఆ పని చేస్తే సరిపోతుంది...."

"అదిగాదు శకుంతలా! వీడి దుష్ప్రవర్తనకు మనం పూచీ పడవలసి వుంటుందని నే ననుకోను. కాని వీడి మొండిధైర్యం తలచుకున్నకొద్దీ నాకు గుండె జలదరించిపోతోంది. ఆ సీతారామయ్యగారు గండరగండడు. ఊరంతా ఆయన చెప్పుచేతల్లో వుంది. వీడిని ముప్పతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ల త్రాగించడం ఆయనకు చిటికెలో పని. ఇక ఆయనగారి కుమారులంటేనా, సామ దాన భేదోపాయాలు తండ్రిగారివైతే చిట్టచివరి దండోపాయం వాళ్ళది. వాళ్ళుగనుక ఓ చేయి చూడదలచుకున్నారంటే, వీడికిక ఈ లోకంలో నూకలుండవు. చూచిచూచీ నిప్పులోకి వురికే మూర్ఖు డెవడైనా వుంటాడా శకుంతలా? వీడి గుండె నిబ్బరాన్ని ఏమనుకోవాలి?"

"ఐతే మీ కిప్పటికీగానీ తెలిసిరాలేదన్నమాట! నెలల పొడుగునా చెవిలో యిల్లు గట్టుకుని చెబుతే ఒప్పుకున్నారుగాదే మరి!" అంతటితో తన కర్తవ్యం తీరిపోయినట్టు శకుంతల చాపపైకి వ్రాలిపోయింది.

కానీ నా బుర్రలో మాత్రం ఆలోచనలు సుళ్ళు తిరిగి పోతున్నాయి.

ఇక్కడ తప్పు ఇరుపైపులా వున్నప్పటికీ, ముప్పు ఒకరిపైకి మాత్రమే కేంద్రీకరింపబడుతోంది. వాయిదా చెల్లిన ప్రోనోట్ల కెన్నింటికో మళ్ళీ జీవమిచ్చి అణాపైసలతో సహా కక్కించుకోగలిగిన సీతారామయ్యగారు తన జేబులోని ఓ చెల్లని నాణాన్ని మార్చుకోలేకపోడు. కానీ ఆయన వంటింట్లో జొరబడిన కుందేలులాంటి ఈ నారాయణను మాత్రం మన్నించి వూరుకోడు.

అయ్యో పాపం! ఈ నారాయణ నుదుట ఎలాటి దుర్గతి వ్రాసి పెట్టాడో భగవంతుడు!

వీడి సంగతలా వుండగా నారప్ప జీవితానికి యింతకంటే దారుణాఘాతం వేరొకటి వుండబోదు.

నారప్ప కొక్కడే కొడుకు. వీడి కైదోయేడు జరుగుతుండగా తల్లి పోయింది. తల్లిలేని కొరత కుమారుడి బ్రతుకుపైన చీకటినీడలు చిమ్మకుండా వాడి ముద్దు చెల్లించడంకోసం, వాడి ముచ్చట తీర్చడంకోసమే తండ్రి తన జీవితాన్ని అంకితం చేశాడు. నారప్పకు ప్రస్తుతం ఆస్తిపాస్తులు లేవు. ఒకప్పుడుండేవి. ఆ ఒకటి ఒకటిన్నర ఎకరా మెట్టపొలం నారాయణ చదువుక్రింద దఖలు పడిపోయింది. అన్నీ పోగా మిగిలి వున్న పూరిపాకలో నారప్ప కాపురం. నాలుగు మేకపిల్లల్ని మేపుకోవడంతోబాటు కూలీనాలీ చేసుకోవడం బతుకుతెరువు.

వార్ధక్యంలో తండ్రికొక వూతకర్రగా వుండి, వీలైనన్ని సదుపాయాలతో అతనికి సుఖశాంతుల్నీ, సంతృప్తినీ చేకూర్చి పితృఋణంనుంచీ విముక్తుడుగావడం కుమారుని బాధ్యత. అంతపని చేయలేకపోతే మానె, అవసాన దశలో తండ్రి చిత్తశాంతికి అగ్గిపుల్లగీసి ముట్టించే నారాయణ లాంటి కుమారుణ్ణి ఎలా మందలించాలి? ఎలా సరిదిద్దాలి?

ఆలోచనలతోనే తెల్లవారింది.

ఆ రోజు సాయంత్రం స్కూలు వదిలిన తర్వాత నారాయణను వూరి బయటకు తీసుకెళ్ళాను. ఏటవాలుగా వున్న ఏటి యిసుక తిన్నెపైన పవ్వ

శించి నీటిపాయలో కాళ్ళాడిస్తూ ఓ సినిమా పాట ముదలంకించుకున్నాడు నారాయణ.

పాట పూర్తయ్యేదాకా ఓపికపట్టి "నీకో మాట చెప్పాలని తీసు కొచ్చాను నారాయణా!" అన్నాను.

"ఒకటేమిటి? వెయ్యి మాటలు చెప్పండి!"

"ఎందుకంటే-చెప్పేవాళ్ళు లేక చెడిపోయిన వాళ్ళు చాలామంది."

"చెప్పేవాళ్ళున్నా చెడిపోతున్నవాళ్ళ మాట మాత్రం చెప్పారు కారు...."

"వాళ్ళతో మనకు ప్రసక్తిలేదు! ఇప్పుడు నేను చెబుతున్నాను. చెప్పడానికి ముందుగా మనం ఒక విషయంపట్ల ఏకాభిప్రాయానికి రావాలి........"

"అలాగైతే మనకు అభిప్రాయభేదాలు గూడా వున్నాయంటారా మాస్టరుగారూ!"

"నేను నీ శ్రేయస్సును అభిలషించేవాణ్ణి. నీ హితాన్ని ఆకాంక్షించే వాణ్ణి. ఈ విషయంలో నీ కపనమ్మకాలు లేవనుకుంటాను...."

"అబ్బే, ఎంతమాట! మీపైన అపనమ్మకమా? నాకు!"

"నువ్వీ వూరికి క్రొత్తవాడివి. నువ్వూ, నీతోపాటు నేనూ ఉదర పోషణంకోసం మాస్టరుగిరీ చేసుకుంటూ యిలా వూళ్ళవెంట తిరుగు తున్నాము. మన తాహతును మనం గుర్తుంచుకుని, అనువుగానిచోట ఆధిక్య మును ప్రదర్శించకుండా, కన్నుబోయే కాటుకేదో తెలుసుకుని కాలమొక రీతిగా గడుపుకపోవాలి. ఇక్కడి మనుషుల గుణదోషాలను గురించి నీ కంతగా తెలియదు. న్యాయాలు, ధర్మాలు, శిక్షలూ, సిద్ధాంతాలు-ఇవన్నీ యీ వూరికంటూ ప్రత్యేకంగా ఏర్పడి వున్నాయి. అవివేకంవల్ల నైతేనేమి, అనాలోచితంగా నైతేనేమి, నువ్వు బురదలో కాలువేశావు. నీ బుద్ధి పెడదారి వెంట ప్రసరిస్తోంది. తీరా ఆకులు కాలిన తర్వాత చేతులు పెట్టుకోవడంవల్ల లాభంవుండదు."

"అదేమిటి మాస్టరుగారూ! మీ మాటలు వింటుంటే నాకు ఏడు పొస్తోంది. నిజానికి నేనేదో పొరబాటుచేసినట్టే వున్నాను. అదేమిటో నాకై తే తెలియడంలేదు గానీ, మీరెంతో మెలకువగా దాన్ని పసికట్టేసినట్టున్నారు. మీకు పుణ్యముంటుంది, త్వరగా చెప్పేసెయ్యండి—" తెచ్చిపెట్టుకున్న దిగులును ముఖంలో రంగరించుకుని, నిజంగానే ఏడుపుముఖం పెట్టేశాడు నారాయణ!

"సీతారామయ్యగారి అమ్మాయికై తే వివేకం లేకపోవచ్చు కానీ నువ్వు మగవాడివి. చదువుకున్నవాడివి. నీకై నా కాస్త తెలివితేటలుండాలని లోకులు ఆశిస్తారు—"

నారాయణ ఆలోచనలో పడ్డాడు. ఇంత త్వరగా నేను నా ఆరోపణను బట్టబయలు చేయగలనని అతడు భావించలేదేమో! దీన్నెలా ఎదుర్కోడమో తోచక తటపటాయిస్తూ, ఆ తికమకను కప్పిపుచ్చుకోడానికి ఓ సిగరెట్టు ముట్టించాడు.

ఒకటి రెండు నిమిషాలు అలా గడచిపోయిన తర్వాత అత డున్నట్లుండి ఓ నిర్ణయానికి వచ్చినట్టు "ఐతే మీ రిప్పుడ నేదేమిటి మాస్టరుగారూ!" అన్నాడు.

"ఒళ్ళెరుగని శివం పనికిరాదని!"

"మీ సలహాకు కృతజ్ఞుణ్ణి!"

"ఇక్కడ కృతజ్ఞత కెవరూ ముఖంవాచి కూర్చోలేదు. నువ్వు బాగుపడడమే నాకు కావలసింది—"

నారాయణ పక్కున నవ్వేశాడు. "నా బాగును గురించి మీరింతగా గాబరాపడవలసిన అవసరం లేదనుకుంటాను.

"మాస్టరుగారూ! మీరు కుర్రాలకు పాఠాలు చెబుతుండగా ఎన్నోసార్లు విన్నాను. మంచి మంచి నీతికథల్ని మీరు పిల్లల మనస్సుల్లో హత్తుకపోయేటట్టుగా చెప్పగలరు! అబద్ధం చెప్పకపోవడం మంచిదే! కానీ అబద్ధంతో అవసరం లేనిదెవడికి? దీన్నే మరొకవిధంగా చెబుతాను- నేను త్రోవంట

నడుస్తున్నాననుకోండి. నాకొక అమూల్యమైన వస్తువు కనిపిస్తుంది. అది పరుల సొత్తుగనుక మీరు తాకగూడదంటారు. అదే నోట సిరిరా మోకాలడ్డేవాణ్ణి మీరేమంటారు? బుద్ధిహీనుడంటారు. అందుకే నీతులంటే నాకు నమ్మకంలేదు. లోకంలో మానవుడికి సంబంధించినంతవరకూ ఒక్కటే ఒక్క నీతిమాత్రం వుంది. తనకు అందిన పండు తీయన, అందనిపండు పుల్లన!"

నేను నివ్వెరపడిపోయాను. నా హితవునే అందిపుచ్చుకుని మలుపులు తిరిగి తిరిగీ చివరకు నారాయణ నా చెంప కొొక చపేటాన్ని ప్రసాదించాడు. కొరడా పెట్టి నా ముఖాన ఒక వాత తీసేశాడు.

నా మందలింపు కింత సూటిగా జవాబొస్తుందని మాత్రం నేను కలగనలేదు. లేదంటే యితడు తన చెడు చెయిదానికి పవిత్ర ప్రణయమన్న మేలి ముసుగును తెచ్చుకోగల డనుకున్నాను. ఎప్పటికప్పుడే తారుమారై పోతూవచ్చిన నారాయణను గురించిన అభిప్రాయాల్లో యిదీ ఒకటై పోయింది.

నేను కృంగిపోయాను. నారాయణకు తోడి మానవులపట్ల వున్న విశ్వాసం అంతంతమాత్రం! మానవజాతి మనుగడ కంతకూ ఆధార భూతమైనది అవకాశవాదమే ననుకునే మనీషాలవ దుర్విదగ్ధునికి ఒక మంచి మాట చెప్పబోయినందుకు నాకు సరైన శాస్తే జరిగింది.

తటాలున పైకిలేచి తిరిగిచూడకుండా యింటిదారి పట్టాను. నారాయణ దీపశిఖలో దూకబోతున్న శలభం! దూకనీ, ఒళ్లు కాలనీ, రెక్కలు రాలిపోనీ! ఏ దేమైతే నాకేం కావాలి?

★ ★ ★

"కళ్ళు తెరచుకుని చూస్తున్నారు గదండీ! కొంప మునగనే మునిగింది!"

"ఏం జరిగింది శకుంతలా!" ఆతురతగా అడిగాను.

"ఇది నాలుగోనెలట!"

"నీకెలా తెలిసింది?"

"నాకేకాదు, ఊరికంతా తెలిసింది."

"ఐతే సీతారామయ్యగారు పెట్టెలో పాములా ఎందుకున్నారో?"

"ఏమిటో మరి! ఆయనకు కడుపులో పళ్లు. మనసులో వున్నదేమిటో ఎవరికి తెలుస్తుంది?"

సీతారామయ్యగారు యిలాంటి విషయంపట్ల మౌనంగా ఉన్నారంటే యిదేదో ప్రమాదానికి సూచనేనన్నమాట! మేఘాలు లేకపోయినా పిడుగులు పడవచ్చు. వానలు లేకపోయినా వరదలు రావచ్చు!

హఠాత్తుగా ఓరోజు రాత్రి పదిగంటలప్పుడు సీతారామయ్యగారి మేడపైన గ్రామం పెద్దల అత్యవసర ఆంతరంగిక సమావేశం జరిగింది. జట్టీలకు గురువులాంటి మిరియాల గంగన్నద్వారా నారాయణ సభాసముఖానికి రప్పింపబడ్డాడు.

వ్యవహారాలను పరిష్కరించడంలో సీతారామయ్యగారికి ఒక ప్రత్యేకమైన కౌశలం కద్దు. ఆయన గోటితోబోయే పనికి గొడ్డలీ తేగలరు. గొడ్డలితో గానీ సాధ్యంకాని సమస్యను గోటితోనూ తుడిచిపెట్టగలరు.

ఈ సందర్భంలో ఆయన తమ రెండో పద్ధతిని అవలంబించారు. సైగలతోనే మాట్లాడుకుని, చూపులతోనే యింగితాన్ని తెలుసుకుని సభాసదులు మూడుముక్కల్లో తమ నిర్ణయాన్ని తేల్చి చెప్పారు- తప్పు జరిగింది. ఎలా జరిగిందన్న విచికిత్స యిప్పుడు అనవసరం. ఇందుకు నారాయణను బ్రతికుండగానే పాతిబెట్టినా అడిగేవాడు లేడు. కానీ సీతారామయ్యగారు దయదలచి అతణ్ణి మన్నించేస్తున్నారు. శిక్ష- అతడు అమ్మాయిని పెళ్ళి చేసుకోడమే! ముహూర్తం కూడా నిర్ణయమైపోయింది. పదిరోజుల్లో పెళ్ళి. రెండు మూడు రోజుల్లో వివాహపత్రికలు అచ్చై రాబోతున్నాయి.

ఆ రెండు మూడు రోజుల్లో నారాయణ ముఖాన్ని పరిశీలనగా చూచే అవకాశం నాకు దొరికిందిగాదు. అతడు మనుషుల్ని తప్పించుకుని తిరుగుతున్నాడు. వివాహం తాలూకు పరిణామాలెలాంటివైనా వివాహం మాత్రం

మానవుడికి ఆనంద హేతువే! కానీ నారాయణ ప్రవర్తనలో ఆనందం సంగతి దేవుడెరుగు- భయమూ, ఆందోళనా మాత్రం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

సీతారామయ్యగారి అమ్మాయి నలుగురు మగరాయళ్ళ మధ్య ఒక్కగానొక్క ఆడపడుచు, ఆమె పేరు పార్వతి. పార్వతి నివాసం తరచుగా తల్లి నెత్తిమీద! అంతగా ఆమె కూతుర్ని నెత్తికెక్కించుకుంటుందన్న మాట! గ్రామ రాజ్యంలో తండ్రి కొడుకులమాట కెలాగైతే తిరుగులేదో, గృహరాజ్యంలో తల్లీకూతుళ్ళ పెత్తనాని కలాగే తిరుగులేదు. సంగ్రహంగా చెప్పాలంటే పార్వతిని పెళ్ళాడబోతున్న వాడెవడైతే వున్నాడో, వాడికి పార్వతే మొగుడు!

ఈ పద్మవ్యూహంనుంచి తప్పించుకుని పారిపోవాలన్న సదుద్దేశం నారాయణకు కలిగిందో లేదో నేను చెప్పలేను. బహుశా కలిగే వుంటుంది. కలిగి వుండదని భావించడం నారాయణ స్వభావాన్ని గుర్తెరుగక పోవడమే. కానీ కంటికి రెప్పలా నిగాబెట్టి రాత్రుల్లో సైతం యింటి కెదురుగా భజన గుడి అరుగుపైన పడుకుంటున్న మిరియాల గంగన్న కళ్ళల్లో కారం కొట్టడం ఎవరితరం?

వీలైతే పారిపోయి వెక్కిరించే బుద్ధిమంతుడే నారాయణ! కానీ వీలు లేకపోవడంవల్ల చిక్కి బిక్కిరించక తప్పిందిగాదు.

రోజులు మాత్రం దొర్లిపోతున్నాయి. ఊళ్ళో పెళ్ళి పత్రికలు గూడా పంపేశారు. వివాహానికింక నాలుగు రోజులకన్నా వ్యవధిలేదు.

మిట్టమధ్యాహ్నం. గదిలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాను. మెల్లగా తలుపు తెరచుకుని కత్తివేటుకు నెత్తురుచుక్కలేని ముఖంతో నారాయణ లోపలికి వచ్చాడు.

అందిన పండు తీయగానే వుందిగదూ- అంటూ నారాయణను పరామర్శించా లనిపించింది. కానీ చచ్చిన పామును మళ్ళీ చితకబాదడం అనవసరమేగాక అమానుషం గూడా కావచ్చు ననిపించి మౌనంగా వుండి పోయాను. ఉండి, వుండీ నారాయణే ప్రారంభించాడు—

"మీరు నాకొక చిన్న సహాయం చేయగలరా మాస్టరుగారూ!"

తల పైకెత్తి అతడివైపు చూచాను.

"మిమ్మల్ని నేను మన్నించమని అడిగేస్థితిలో లేను. కానీ మీరు ఎడతెగకుండా తప్పులు చేసే కుర్రవాళ్ళని క్షమించడానికి అలవాటు పడ్డారు. వాళ్ళల్లో నన్నూ ఒక్కణ్ణిగా భావించలేరూ?"

"ఉపోద్ఘాత మెందుకూ, సహాయ మేమిటో చెప్పు" అన్నాను.

"మీరు మా వూరికి వెళ్ళిరావాలి."

"ఎందుకూ?"

జేబులోనుంచి ఒక జాబు తీసి నా చేతి కందించాడు నారాయణ.

తనకు ఒంట్లో కులాసాగా ఉండటం లేదని టూకీగా వ్రాయించి, మిగిలిన జాబంతటా కుమారుడి యోగక్షేమాలపట్ల తనకున్న ఆసక్తినీ, ఆరాటాన్నీ నింపి పంపాడు నారప్ప.

"ఐతే ఆయనకింకా వివాహ వర్తమానం తెలియదన్న మాట!"

"ఎలా తెలుస్తుంది! నేను జాబైనా వ్రాయలేదు. మీకు తెలుసు. నేను ఏం చేయాలో, ఏం చేయకూడదో తెలియని, దిక్కులు దోచని పరిస్థితిలో వున్నాను. పైగా జాబు వ్రాస్తే వూళ్ళో లేనిపోని పుకార్లు అల్లుకపోతాయి. మీరు గనుక వెళ్ళే నేరులో అన్ని విషయాలూ సర్ది చెప్ప గలరు........"

ఎన్నడూ లేనిది నారాయణ కంఠంలో గాద్గద్యం స్పష్టంగా పెల్లుబికింది. చూపులు భూపతనమైపోగా పది పదిహేను నిమిషాల వరకూ అతడలాగే కూర్చుండి పోయాడు.

* * *

పెండ్లి పిలుపును మోసుకుని ఉదయం పదిగంటలప్పుడు బస్సెక్కాను. తుమ్మచెట్లు, ముళ్ళకంపలు బలిసిపోయిన పోరంబోకు బీళ్ళమధ్య, నిగనిగల కరవాలపు టంచులాంటి నీరెండలో, మలుపులు తిరిగిపోతున్న మట్టి బాటపైన బస్సు పరుగిడుతోంది. మొదట పన్నీటి స్నానంలాంటి

చెమట, ఆపైన చందన పరాగంలాంటి ఎఱ్ఱటి దుమ్ముతో నలుగు; వీటితో ప్రయాణీకులకు యథోచిత సత్కారం జరిగిపోతోంది.

ఈ బస్సులోనుంచి వేరొక బస్సులోకి మారి, ఆ తరువాత కాలిబాట వెంట అయిదు మైళ్ళు నడిస్తేగాని కళ్ళకు కనిపించదు రంగసముద్రం!

మన పల్లెటూళ్ళకు దారిడొంక లుండవనీ, అవి దమ్మిడీకి గూడా పనికిరావనీ పాట వ్రాసిన తర్వాత పాతికేళ్ళకు గూడా సరిగ్గా అదే పరిస్థితిలో వున్న కుగ్రామం రంగసముద్రం!

బస్సు పన్నెండున్నర గంటలకు తన గమ్యస్థానం చేరుకుంది. తీరా అక్కడ దిగిన తర్వాత మళ్ళీ నే నెక్కవలసిన బస్సు అరగంట ముందుగా వెళ్ళిపోయినట్టు కబురు తెలిసింది. గోళ్ళు గిల్లుకుంటూ మూడు గంటలసేపు బస్‌స్టాండులో పడిగాపులు పడడంకన్నా గత్యంతరం లేక పోయింది.

ప్రయాణాలు చేయబోకండి—అన్న హెచ్చరికకు రూప కల్పన లాంటిది ఆ రెండో బస్సు. చావు దప్పి కన్ను లొట్టబోగా యుద్ధభూమి నుంచి పారిపోయివచ్చిన క్షతగాత్రుడిలా కనిపించిందది! చిన్న గుహ లాంటి ఆ బస్సులో ప్రయాణం మనిషిని గోతంలోకి త్రోసి, మూతి బిగించి, రూళ్ళకర్రతో చిత్తుచిత్తుగా బాదడంలాంటి అనుభవం! ఈ లక్షణానికి దోడూ అడపా దడపా మరమ్మత్తులతో లాలించకపోతే ముందుకు కదలనన్న మంకుపట్టొకటి దానికి! పోగా సముద్రాన్ని ఆపోశనం పట్టిన కుంభసంభ వుడికీ, దీనికీ వున్న బంధుత్వ మెలాటిదో మనకు తెలియదు. బాట ప్రక్కన ఎక్కడ జలాశయం కనిపించినా నాలుగు బకెట్ల నీళ్ళు తెచ్చి వుదరంలో పోస్తేగానీ దానికి తృప్తిలేదు!

ఈ బస్సులో నుంచీ బయటపడేసరికి యిటు నేలపైనా గాక, అటు వినువీధిలోనూ గాక అంతర్మధ్యంలో వూగిసలాడిపోయినట్టు, గిరికీలు కొట్టినట్టు ఓ విచిత్రమైన అనుభూతి కలిగింది.

రాత్రి ఎనిమిది గంటల వేళ. ఇదివర కెన్నడూ చూచి ఎరుగని వూరు. ఊళ్ళో ఒకటి రెండు చిల్లరంగళ్ళు తప్పితే హోటళ్ళూ, గీటళ్ళూ లేవని

వర్తమానం! అరపడి శనగపప్పు తిని, మిగిలిన ఖాళీని దాహం చల్లార్చలేని వుప్పునీళ్ళతో పూరించి, శిధిలావస్థలో వున్న పాతసత్రంలో విశ్రమించాను.

ఎప్పుడు తెల్లవారిందో నాకు తెలియదు. కళ్ళు తెరిచేసరికి తూరుపు కొండకు రెండు బారల పైన సూర్యుడు మళ్ళీ నే నున్నానంటూ ప్రత్యక్ష మయ్యాడు.

రంగసముద్రానికి ఎలా వెళ్ళాలో, ఎక్కడెక్కడ మలుపులు తిరగాలో వివరంగా చెప్పి ఓ వృద్ధుడు పుణ్యం గట్టుకున్నాడు. దూరంగా ఒక గుట్ట. గుట్టపైన మూడు తాటిచెట్లు. వృద్ధుడి వివరాలన్నింటిలోనూ ఈ కొండ గుర్తు నాకు బాగా వుపకరించింది.

డొంకదారి నన్ను చేలలో దిగవిడిచి వెనుకబడిపోయింది. కనుచూపు మేరకూ నల్లరేగడి చేలు. కనుమల్లో రక్తం గడ్డ కట్టినట్లుగా పువ్వులతో క్రిక్కిరిసిన మోదుగ చెట్లు, మాసికలు చిరుగులుపడిన దుస్తులతో భుజాన తట్టలు వేసుకుని పొలంలోకి పేడకోసం, పొయిలోకి చిదుగులకోసం పరుగులుతీస్తున్న కాపుకన్నెలు. ఈ ప్రకృతి వేరు. ఈ మనుషులు వేరు. పట్టణాలు పార్కుల్లాంటివి. అక్కడ ప్రతి చెట్టుకూ దోహదక్రియలు జరిపేవారున్నారు. ప్రతి తీవకూ ఆలంబనం ఏర్పాటు చేసేవారున్నారు. ఇక్కడ ఎన్నిచెట్లు మోళ్లైనా పట్టించుకునేవాడులేడు. ఎన్నితీగలు ఎండల దుమ్ములో మాడి ముదమారిపోయినా గమనించేవాడు లేడు.

ఇలాంటి పరిసరాల్లో అంగ రంగ వైభోగంలాంటి నవ నాగరికత నుంచి దూరంగా విసరివేయబడినట్టున్న రంగసముద్రం చింతచెట్ల క్రింద బిక్కుబిక్కుమంటూ కనిపించింది.

రచ్చదగ్గర నిల్చుని 'నారప్ప యిల్లెక్కడ?' అని వాకబు చేశాను.

"ఇదిగో, యిక్కడే!" అంటూ కుర్రవాడొకడు ఒక పూరికొట్టం చూపించాడు.

ఉప్పుతినిపోతున్న గోడలతో, కప్పెగిరిపోయి వెదుళ్ళు పైకి కనిపిస్తున్న ఆ పూరి కొట్టంలోకి తొంగిచూచాను. మూలగా ఓ కుక్కిమంచం. మంచంపైన ఎముకల ప్రోవులా పడివున్నాడు నారప్ప.

"నారప్ప తాతా! నీకోసం ఎవరో వచ్చారు" అన్నాడు కుర్రవాడు.

"ఎవరు బాబూ, ఎవరు?" ఖర్జూరపు పళ్ళలా బిగుసుకపోయిన పెద వులపై నుంచి మాటలు నీరసంగా వెలువడ్డాయి. దట్టంగా పెరిగిన తెల్లటి గడ్డానికి వెనుక అతడి కళ్ళు నీళ్ళులేని అగాధాల్లా వున్నాయి.

"ఇదేమిటి నారప్పా! ఇంత జబ్బులో కొట్టుమిట్టాడిపోతూ, విష యాన్ని వున్నదున్నట్టుగా వ్రాయించలేకపోయావా?" అంటూ మంచంపైన ఒక వారగా కూర్చున్నాను.

"నువ్వా నాయనా! నా జబ్బుకేంగానీ ఎప్పుడొచ్చావు? ఇంతదూరం నువ్వొక్కడివే వచ్చావా? నారాయణ ఏడీ! కుర్రాడు బాగున్నాడు కదూ? వాడికిబ్బందేమీ కలుగలేదు గదూ?"

"మరేం కంగారుపడకు నారప్పా! నారాయణ నిక్షేపంలా వున్నాడు. నేను నీకొక శుభవార్త చెప్పడానికి వచ్చాను. నారాయణకు పెళ్ళి హఠాత్తుగా నిర్ణయమైపోయింది...."

"పెళ్ళే! మా నారాయణకేనా బాబూ! నిజంగా?" అగాధంలో బుగ్గ పుట్టి తటాలున నీటిమట్టం పైకి లేచినట్టు అతడి కళ్ళల్లో ఓ వింతకాంతి హోరులెత్తింది.

"నిజమే నారప్పా! పరిస్థితులన్నీ అలా కుదిరాయి. కల్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదన్నారుగదా మరి! నువ్వు దగ్గర లేనందుకు నారాయణ ఎంతగానో నొచ్చుకున్నాడు...."

"భగవంతుడు నాయనా, భగవంతుడు! మనిషి చేయగలిగిందేముంది చెప్పు. నాకు తెలుసు, మా నారాయణ కెవరో పిలిచి పిల్లనిస్తారనే నేనను కున్నాను. చెప్పు బాబూ చెప్పు! సంబంధం ఎక్కడిది? పెళ్ళెప్పుడు?"

"ఉన్నవాళ్ళతో సంబంధం! అందుకే పురకలు పెట్టూ వచ్చి కాళ్ళకు చుట్టుకుంది! వ్యవధి గూడా అట్టే లేదు, యెల్లుండి తెల్లవారుజామున ముహూర్తం."

"అలాగా బాబూ! నువ్వు నా కడుపులో పాలుపోశావు. చెప్పరా నంత ఆనందంగా వుంది నాకు....ఒరేయ్ రంగడూ! ఒక లగువుతో వెళ్ళి

ఆచార్లుగారిని కేకేసుకరా! వేగిరం వెళ్ళు. యిక్కడున్నట్టుగా రావాలిమరి!" కుర్రవాడు పరుగందుకోగానే మళ్ళీ ప్రారంభించాడు నారప్ప: "ఆచార్లుగారంటే ఎవరనుకుంటున్నావు బాబూ! రాజవైద్యుడు. మహానుభావుడు. అతడే గనుక లేకుంటే నేను మొన్నరాత్రే కళ్ళు మూసుకోవలసింది. ఇంత కట్టు మాత్ర రంగరించి పోశాడో లేదో, కొండంత జ్వరం కొండెక్కిపోయింది. అస లారాత్రి దూత దర్శనం గూడా అయింది నాకు. ఒకడు కాదు నాయనా, యిద్దరు! తుమ్మమొద్దుల్లా వున్నారు. శూలాలు చేతబట్టుకున్నారు. చంద్ర నిప్పుల్లా యింతింతలేపి కళ్ళు. 'ఊఁ-వెళ్దాం రా! నీ ఆకు బయటపడింది' అన్నారు. నిజం చెప్పొద్దూ! కోపమొస్తే నేను మనిషినేగాను! 'వెళ్ళండి. నలుసులా ఒక్క బిడ్డ నాకు. వాడొక యింటివాడు కాందే నేను కదలనంటే కదలను' అంటూ తరిమి తలుపేసుకున్నాను. కలేననుకో బాబూ! కానీ కళ్ళ ముందే జరిగినట్టుంది. దూతలలా వచ్చి వెళ్ళిపోవడం, నువ్వీ మంచి సంగతి తెచ్చి నా చెవిలో వేయడం...." ఆయాసంతో నారప్పకు ఒగర్పు పుట్టింది. లేచి కూర్చోడానికి ఒకటి రెండు విఫల ప్రయత్నాలు చేసి, అతడు మళ్ళీ తలగడపైకి ఒరిగిపోయాడు.

"ఏమిటి నారప్పా! ఎలా వుంది? నీకోసం ఎవరో వచ్చారటగా" అంటూ లోపలికి వచ్చారు ఆచార్లుగారు. ఆయనతోబాటు యిరుగు పొరుగు వాళ్ళు అయిదారుగురు బిలబిలా వచ్చేశారు.

"వచ్చింది ఈయనేనండీ ఆచార్లూ! మా అబ్బాయి స్నేహితుడు. పెళ్ళి గనుక స్వయంగా రావడానికి వీల్లేక నారాయణ స్నేహితుణ్ణి పంపించాడు. చూడండి ఆచార్లూ! తమ రుణం వుంచుకోను. రేపీపాటికల్లా లేచి నడవగలిగేటట్టుగా నాకో మందివ్వలేరూ?"

ఆచార్లుగారు విస్తుపోతూ నారప్పవైపు పరకాయించి చూచారు. ఆ తరువాత నన్ను తమ వెంట రమ్మని చేయి విసరి మెల్లగా బయిటికి దారి తీశారు.

"ఇదేమిటి నాయనా! ఆ ముసలాడు మంచంపైనుంచి దిగేస్థితిలో వున్నాడనుకుంటున్నావా నువ్వు! గడిచిన రాత్రి గూడా జ్వరమూ, జ్వరంతో

బాటు చలీ ముంచుకొచ్చేశాయి. మాయదారి జ్వరం. దీన్ని నమ్మడానికి వీల్లేదు. తగ్గినట్లే తగ్గి పుట్టిని నట్టేటిపాలు చేస్తుంది. ఉన్నమాట చెప్పేశాను. తరువాత నీ యిష్టం...."

"మరి కుమారుడికి పెళ్ళిగదండీ! తండ్రి కెంతైనా వుబలాటం వుండదూ?"

"ఏడ్చాడు! వాడొక కుమారుడు. ఆ కుమారుడికీ సిగ్గులేదు, మొన్న పోయిన అమావాస్యకూ సిగ్గులేదు. తండ్రికొక పూట తిండి పెట్టలేని ఆ వెధవకు పెళ్ళవుతోందని, ముసలి ప్రాణానికి ముప్పు తలపెట్టావా నువ్వు!"

ఆచార్లుగారు వెళ్ళిపోయారు. బరువెక్కిన హృదయంతో మళ్ళీ లోపలికి వెళ్ళాను.

"ఏమంటున్నారు బాబూ, ఆచార్లుగారు?" ఆశగా అడిగాడు నారప్ప.

"నువ్వు మంచంమీదినుంచి కదలడానికి వీల్లేదంటున్నారు...."

నారప్ప ముఖం వివర్ణమైపోయింది. "అంటాడు. ఎందుకనడు! మంచి మందివ్వవలసి వస్తుందని అతగాడి బెంగ!" ఆ శక్తి ఎక్కడినుంచి వచ్చిందో నాకు తెలియదు. చివాలున లేచి కూర్చున్నాడు నారప్ప- "అక్కర్లేదు, నాకు మందే అక్కర్లేదు. రేపీపాటికల్లా నేను లేచి చకచకా నడవలేకపోతే అప్పుడడుగు...." నారప్ప శరీరం గాలిలో దీపంలా కదిలిపోతోంది. అతడు రొజుకుంటూ బొంతపైకి వ్రాలిపోయాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసాల వురవడిలో రొమ్ము కొలిమితిత్తిలా క్రిందుమీదులౌతోంది.

ఆ రోజు రాత్రి చాలాసేపటివరకూ నారప్పదగ్గరే కూర్చుండిపోయాను. తొలిజాము మాటలతో గడిచిపోయింది. మలిజామున జ్వరం తెరలు తెరలుగా వచ్చి నారప్పను క్రుంగదీసింది. అర్ధరాత్రి గడచిన తర్వాత అతడు చలిలో దుప్పటిక్రింద చుట్టలు జుట్టుకపోయాడు. అంత జ్వరంలో గూడా కుమారుడి పెళ్ళిచుట్టూ పారాడుతున్న అస్పష్టమైన భావనలను వ్యక్తం చేయడానికి ప్రయత్నిస్తూ, మాటలు స్ఫురించక, పెదవులు విడివడక, గొంతుక పెగలక అతడు పడుతున్న బాధను చూడలేక ఈవలికి

వచ్చేశాను. తనలోని జీవ చైతన్యాన్నంతా కుమారుడిపట్ల ప్రేమగా మార్చుకున్న మానవుడు నారప్ప. 'వాడువినా తను లేడు, వాడితోడిదే తనకు లోకం' అన్నంతగా కుమారుణ్ణి గురించిన తలపులకు తన మనసులో చోటిచ్చి నారప్ప తనను తనే విస్మరించాడు. నారప్పకు సంబంధించినంత వరకూ పుత్రప్రేమ అదొక తపస్సు.

తెల్లవారింది.

లేచి కూచుంటూ లోపలికి చూచాను. మంచంపైన నారప్పలేడు.

గబాలున లేచి నిల్చుంటూ 'నారప్పా, నారప్పా!' అని గావుకేక పెట్టేశాను.

"ఇక్కడున్నాను బాబూ! మనం బస్సుకు బయల్దేరొద్దూ? ముఖం కడుక్కుంటున్నాను...."

ఎలా లేవగలిగాడు నారప్ప! ఇంతదూరం ఎలా నడిచి రాగలిగాడు? జబ్బుతో తీసుకుంటున్న మనిషి మంచినీళ్ళతోనా ముఖం కడుక్కోవడం? ఐనా అవెప్పటి నీళ్ళు!

"ఇదిగో నారప్పా! నువ్వు కదలకుండా కూర్చోవాలి. ఎవరైనా నీళ్ళు కాచి తీసుకొస్తారు. వేడివేడిగా పాలు త్రాగితేగానీ నీకు ఓపిక చేకూరదు. ప్రయాణం సంగతి ఆ తరువాత ఆలోచించుకోవచ్చు...." అన్నాను.

నారప్ప నా మాటలు వినీ విననట్టు తన పని తాను చేసుకపోయాడు. ముఖం కడుక్కోగానే యింటిలోపలికి వెళ్ళి కట్టుకున్న పంచను విప్పి వుదికిన ధోవతి కట్టుకున్నాడు. 'తాళం ఎక్కడో వుండాలి. చాలా రోజులైంది చూచి' అంటూ దీగుళ్ళన్నీ గాలించి చివరకు తాళాన్ని వెదకి పట్టేశాడు.

"ఇక వెళ్దామా బాబూ!" అంటూ ద్వార బంధానికి ఆనుకుని నిల్చున్నాడు.

నిల్చున్నాడేగానీ నారప్పకాళ్ళు గడగడా వణకిపోతున్నాయి.

రెప్పలు కదలని అతడి కళ్ళల్లో ఉన్మాదంలాంటి నీడలు నడయాడు తున్నాయి.

మంచం దగ్గరున్న చేతికర్రకోసం అతడు రెండడుగులు ముందుకు వేశాడు.

మూడో అడుగు వేయనేలేదు నారప్ప. కుప్ప కూరలా దభేలున నేలపైన పడిపోయాడు.

క్షణాల్లో పెద్దాచిన్నా ఆడామగా వ్యత్యాసం లేకుండా వూరంతా నారప్పచుట్టూ ప్రోగయింది. జనాన్ని చీల్చుకుంటూ ఆచార్లుగారు గూడా అదరాబాదరాగా వచ్చేశారు.

"మీరంతా మొద్దు పీనుగలు. ఒంటికేదైనా వస్తే వైద్యుడు చెప్పిన మాట వినాలన్న బుద్ధే వుండదు మీకు! మనిషి స్పృహలేకుండా కళ్ళు తేల వేసేస్తుంటే చుట్టూచేరి అతగాడికి గాలికూడా రాకుండా చేస్తారా మీరు? వెళ్ళండి వెళ్ళండి" అంటూ ఆచార్లుగారు నోరు చేసుకున్నమీదట యిల్లు పలచబడింది.

"దిగాలుపడి నిల్చున్నా రెందుకూ? పట్టండి. మంచంపైకి పట్టండి" అంటూ ఆచార్లుగారు మందులసంచి తెరచి డబ్బీలు పైకి తీయసాగారు.

ప్రేక్షక మాత్రుణ్ణిగా పరిణామా లన్నింటినీ అవలోకిస్తూ, కర్తవ్య మేమిటో తోచక చింతచెట్టు క్రింద నిల్చున్నాను. శుష్కకాష్ఠం లాంటిది నారప్ప శరీరం. అది మళ్ళీ రోగశయ్యకే అంకితమై పోయింది. మందులూ మాకులూ, మంత్రాలు తంత్రాలు అంటూ ఆచార్లుగారు తమ పాట్లేవో పడు తున్నారు.

సూర్యుడు నడిమింటికి రానూ వచ్చాడు. పడమటికి వ్రాలనూ వ్రాలి పోయాడు.

"అగ్నిహోత్రంలాంటిది నాయనా మృత్యుదేవత కడుపు! ఈ సమిధ పడితే గానీ అదీ రోజు శాంతించే సూచనలు లేవు" అంటూ దగ్గరికి వచ్చారు ఆచార్లుగారు.

"అంతేనా ఆచార్లుగారూ, కథ ముగిసిపోయినట్టేనా?" అన్నాను.

ఆచార్లుగారు ఒకరిని కొంకాయకోసం రెడ్డిగారి తోటకు వెళ్ళి రమ్మన్నారు. మరొకరిని తులసికోసం పంపారు. వేరొకరిని తమ యింటికివెళ్ళి శ్రీపాదరేణువు తీసుక రమ్మన్నారు.

"ఉన్నంతకాలం వుద్ధరించలేకపోయినా చచ్చిన తర్వాత తల కొరివి పెట్టడం కుమారుడి కనీసపు ధర్మం! వెళ్ళు నాయనా వెళ్ళు. రేపు సాయంత్రానికైనా వా డిక్కడికి వచ్చేటట్టు చూడు. రాగలిగితే మంచిదే. లేకపోతే ఏదో మేము నలుగురమున్నాము, ఈడ్చిపారేస్తాము. ఎందుకైనా నువ్వు త్వరగా వెళ్ళాలి మరి. ఈ వేళప్పుడు బస్సు వుండవనుకో, ఏదైనా లారీ దొరకవచ్చు నీకు...."

ఎలాగైనా ఆచార్లుగారిది సిద్ధవాక్కు, ఆయన మాటమేరకూ రాత్రి ఎనిమిది గంటలప్పుడు నాకు రోడ్డుపైన ఓ లారీ తటస్థపడింది.

బొగ్గుల మూటలపైన కూర్చోగలిగితే తనకేమీ అభ్యంతరం లేదన్నాడు డ్రయివరు.

ఆ రోజు రాత్రి లారీపైన పడక అంపశయ్యలా అమరింది నాకు! ఆకాశంలో నక్షత్రాలు లెక్కబెడ్తూ పడుకున్నాను.

గుడి కనిపిస్తే ప్రదక్షిణం చేసి, దేవుడికి దండం పెట్టుకోకుండా ముందుకు కదల్లేని భక్తుడిలాంటిది ఆ లారీ! అది మార్గమధ్యంలో ప్రతి టీస్టాలు దగ్గరా అరగంటసేపు ఆగిపోతూ వచ్చింది.

తెల్లవారబోతుండగా త్రాళ్ళు పట్టుకొని మెల్లగా క్రిందికి దిగజారాను. ఊరి పొలిమేరలో అడుగుపెట్టేసరికి సన్న సన్నగా సన్నాయిమేళం వినిపించింది. డోళ్ళు ధణధణా మ్రోగిపోతున్నాయి.

★